ఈసారైనా చిక్కేనా!

నేటి నుంచి భారత్, దక్షిణాఫ్రికా బాక్సింగ్ డే టెస్టు

మధ్యాహ్నం 1.30 నుంచి..

సఫారీ గడ్డపై మొదటి సిరీస్ కోసం రోహిత్ సేన తహతహ

కొరుకుడు పడని కంగారూలను ఆస్ట్రేలియాలోనే ఒకటికి రెండు సార్లు మట్టికరిపించిన టీమ్ఇండియా.. దక్షిణాఫ్రికాలో మాత్రం సత్తాచాటలేకపోయింది!

మూడు దశాబ్దాల్లో ఎనిమిదిసార్లు అక్కడ పర్యటించినా.. ఒక్కటంటే ఒక్కసారి కూడా సిరీస్ గెలువలేకపోయాం!

ఇంగ్లండ్‌లో ఇంగ్లిష్ టీమ్‌ను చిత్తు చేయడం.. న్యూజిలాండ్‌లో కివీస్‌ను పడగొట్టడం ఇలా ఎన్ని ఘనతలు సాధించినా.. సఫారీ గడ్డపై టెస్టు సిరీస్ విజయం భారత్‌ను ఊరిస్తూనే ఉంది!

సారథులు మారినా.. ప్లేయర్లు మారినా.. ఫలితం మాత్రం మారలేదు. మరి రోహిత్ కెప్టెన్సీలో బాక్సింగ్ డే టెస్టుతో సిరీస్ ప్రారంభించనున్న టీమ్ఇండియా ఈసారి చరిత్ర తిరగరాస్తుందాచూడాలి!!

సెంచూరియన్: దక్షిణాఫ్రికా పర్యటనలో టీ20 సిరీస్‌ను సమం చేసుకొని.. వన్డే సిరీస్ చేజిక్కించుకున్న టీమ్ఇండియా ఇప్పుడు అసలు సిసలు సమరానికి సమాయత్తమైంది. ప్రతి ఒక్కరూ ఆసక్తిగా ఎదురుచూస్తున్న రెండు మ్యాచ్‌ల టెస్టు సిరీస్‌కు మంగళవారం తెరలేవనుంది. పేస్‌కు సహకరించే సెంచూరియన్‌లో ఇరుజట్ల మధ్య నేటి నుంచి తొలి టెస్టు ప్రారంభం కానుంది. 1992 నుంచి మొదలుకొని ఇప్పటి వరకు 31 ఏండ్లలో 8 సార్లు దక్షిణాఫ్రికాలో పర్యటించిన టీమ్ఇండియా ఒక్కసారి కూడా టెస్టు సిరీస్ గెలువలేకపోయింది. ఒకే ఒక్కసారి సిరీస్ 'డ్రా' చేసుకొని మిగిలిన ఏడుసార్లు ప్రత్యర్థికి కప్పు అప్పజెప్పింది. ఈ సారి ఆ లెక్కలు సరిచేయాలనే ఉద్దేశంతో భారత జట్టు ఉంటే.. అజేయ రికార్డు కొనసాగించాలని ప్రొటీస్ రెడీ అవుతున్నారు. గత పర్యటనలో పటిష్ట జట్టుతో బరిలోకి దిగిన టీమ్ఇండియా.. తొలి మ్యాచ్ నెగ్గి ఆశలు రేపినా.. ఆ తర్వాత వరుసగా రెండు టెస్టులు ఓడి సిరీస్ కోల్పోయింది. ఈ ఫలితం అనంతరమే విరాట్ కోహ్లీ సారథ్య బాధ్యతల నుంచి తప్పుకున్నాడు. ఇక అప్పటి నుంచి అన్ని ఫార్మాట్లలో భారత జట్టుకు కెప్టెన్‌గా వ్యవహరిస్తున్న రోహిత్ శర్మకు ఈ టూర్ పరీక్ష కానుంది. పేస్‌తో పాటు అదనపు బౌన్స్‌తో అనూహ్యంగా స్పందించే సఫారీ పిచ్‌లపై అటు సారథిగా.. ఇటు బ్యాటర్‌గా రోహిత్ ఎలాంటి ప్రదర్శన చేస్తాడనేది కీలకం కానుంది. స్టార్ బ్యాటర్ కోహ్లీకి దక్షిణాఫ్రికాలో మంచి రికార్డు ఉంది. పరిస్థితులు క్లిష్టంగా ఉన్నప్పుడే అత్యుత్తమ ఆటతీరు కనబర్చే కోహ్లీ సఫారీ గడ్డపై 50కి పైగా సగటుతో పరుగులు రాబట్టాడు. ఇప్పుడు సారథ్య బాధ్యతలు లేకపోయినా.. మిడిలార్డర్‌లో అన్నీ తానై వ్యవహరించాల్సిన పరిస్థితి కనిపిస్తున్నది. వన్డే ప్రపంచకప్ ఫైనల్ పరాజయం అనంతరం పలు సిరీస్‌ల నుంచి విశ్రాంతి తీసుకున్న సీనియర్ ప్లేయర్లు ఈ సిరీస్‌లో బరిలోకి దిగనున్నారు.

ఆ ఇద్దరు లేకుండా..

రివర్స్ స్వింగ్, బౌన్స్‌తో భయపెట్టే దక్షిణాఫ్రికా పిచ్‌లు ప్లేయర్ల సహనాన్ని పరీక్షించడం సహజమే. క్రీజులో కుదురుకోకుండా అడ్డదిడ్డంగా ఆడే ప్రయత్నం చేస్తే.. వికెట్ సమర్పించుకోవడం పక్కా! అందుకే సఫారీ పర్యటన ఆటగాడి నైపుణ్యానికి సవాలు వంటిదని విశ్లేషకులు అభిప్రాయపడతారు. టెస్టు స్పెషలిస్టులు అజింక్యా రహానే, చతేశ్వర్ పుజారా లేకుండా భారత జట్టు ఈ సిరీస్ ఆడనుంది. వారిద్దరి టెస్టు అరంగేట్రం తర్వాత (2006 నుంచి) సఫారీ పర్యటనలో వాళ్లు లేకుండా భారత జట్టు టెస్టులు ఆడలేదు. టెక్నిక్ పరంగా అత్యుత్తమ ప్లేయర్లుగా గుర్తింపు సాధించిన ఈ ఇద్దరు గత పర్యటనలో పెద్దగా ఆకట్టుకోలేకపోగా.. ఆ తర్వాత కూడా స్థాయికి తగ్గ ప్రదర్శన చేయలేదు. ఫలితంగా వారికి జట్టులో చోటు దక్కలేదు. గత టూర్‌తో పోల్చుకుంటే ఈ సారి పలువురు కొత్త ఆటగాళ్లు బరిలోకి దిగనున్నారు. రోహిత్‌తో కలిసి యశస్వి ఇన్నింగ్స్‌ను ఆరభించనుండగా.. వన్‌డౌన్‌లో గిల్ బరిలోకి దిగనున్నాడు. ఆ తర్వాత విరాట్ కోహ్లీ, రాహుల్, శ్రేయస్, జడేజా బ్యాటింగ్‌కు రానున్నారు. టెస్టు క్రికెట్‌లోనూ రాహుల్ వికెట్ కీపింగ్ బాధ్యతలు చేపట్టనుండటంతో మరో అదనపు బ్యాటర్‌ను ఆడించే చాన్స్ దక్కినట్లైంది. అయితే దక్షిణాఫ్రికా జట్టులో రబడ, ఎంగ్డీ, కోట్జీ వంటి సూపర్ ఫాస్ట్ బౌలర్లు ఉండటంతో యువ ఆటగాళ్లు వారిని ఎలా ఎదుర్కొంటారనేది ఆసక్తికరం. మ్యాచ్‌కు వర్షం ముప్పు పొంచి ఉండటంతో రెండో స్పిన్నర్ అశ్విన్ స్థానంలో పేస్ ఆల్‌రౌండర్ శార్దూల్ ఠాకూర్‌కు అవకాశం దక్కొచ్చు. ఇక సీనియర్ పేసర్ మహమ్మద్ షమీ గాయపడటంతో ముఖేశ్, ప్రసిద్ధ్‌లో ఒకరికి తుది జట్టులో చాన్స్ దక్కనుంది. బుమ్రా, సిరాజ్‌పై బాధ్యత ఎక్కువ ఉండనుంది.

పిచ్, వాతావరణం

దక్షిణాఫ్రికాలోని పిచ్‌లలోనే సెంచూరియన్ వేగవంతమైంది. ఆటకు తొలి రెండు రోజులు వర్షం ముప్పు పొంచి ఉంది. అంటే బౌలర్లకు మరింత సహకారం లభించే అవకాశాలున్నాయి. ఇక్కడ ఆడిన 28 టెస్టుల్లో 22 మ్యాచ్‌ల్లో దక్షిణాఫ్రికా విజయం సాధించగా.. గత పర్యటనలో భారత్ సాధించిన ఏకైక విజయం ఇక్కడే నమోదైంది.

తుది జట్లు (అంచనా)

భారత్: రోహిత్ (కెప్టెన్), యశస్వి, గిల్, కోహ్లీ, రాహుల్, శ్రేయస్, జడేజా, శార్దూల్/అశ్విన్, బుమ్రా, ప్రసిద్ధ్, సిరాజ్.

దక్షిణాఫ్రికా: బవుమా (కెప్టెన్), ఎల్గర్, మార్క్‌రమ్, జోర్జి, కీగన్, కైల్ వెరీనె, మార్కో జాన్సన్, కేశవ్, కోట్జీ, రబడ, ఎంగ్డీ.

త్రిష (73)

రాణించిన త్రిష

హైదరాబాద్, ఆట ప్రతినిధి: ఇండోర్ వేదికగా జరిగిన మహిళల అండర్-23 ట్రోఫీలో హైదరాబాద్ క్వార్టర్స్‌లోకి దూసుకెళ్లింది. సోమవారం జరిగిన పోరులో హైదరాబాద్ 3 పరుగుల తేడాతో ఆంధ్రపై విజయం సాధించింది. తొలుత హైదరాబాద్ నిర్ణీత 20 ఓవర్లలో 4 వికెట్ల నష్టానికి 124 పరుగులు చేసింది. కెప్టెన్ గొంగడి త్రిష(57 బంతుల్లో 73) అర్ధసెంచరీతో అదరగొట్టింది. ప్రత్యర్థి బౌలర్లను దీటుగా ఎదుర్కొంటూ త్రిష ఇన్నింగ్స్‌ను ముందుకు నడిపించింది. ఆ తర్వాత లక్ష్యఛేదనకు దిగిన ఆంధ్ర 20 ఓవర్లలో 8 వికెట్లకు 121 పరుగులకు పరిమితమైంది. పుష్పలత(58) అర్ధసెంచరీతో ఆకట్టుకోగా, మిగతావారు విఫలమయ్యారు. యశశ్రీ (3/16) ఆకట్టుకుంది. క్వార్టర్స్‌లో ఢిల్లీతో హైదరాబాద్ తలపడుతుంది.

యోధాస్‌కు చుక్కెదురు

కటక్: అల్టిమేట్ ఖో ఖో(యూటీటీ) లీగ్‌లో తెలుగు యోధాస్‌కు చుక్కెదురైంది. సోమవారం జరిగిన తమ రెండో మ్యాచ్‌లో యోధాస్ 32-38తేడాతో చెన్నై క్విక్‌గన్స్ చేతిలో ఓటమిపాలైంది. చెన్నై ప్లేయర్ రామ్‌జీ కశ్యప్ 14పాయింట్లతో ఆల్‌రౌండ్ ప్రదర్శన కనబరిచాడు. రామ్‌జీ మూడు స్కైడైవ్స్‌తో ఆకట్టుకున్నాడు. మరో మ్యాచ్‌లో గుజరాత్ జెయింట్స్ 41-30తో రాజస్థాన్ వారియర్స్‌పై విజయం సాధించింది.

వన్డేల్లో మరింత బలంగా..

ఆస్ట్రేలియాతో సిరీస్‌కు మహిళల జట్టు ప్రకటన

న్యూఢిల్లీ: ఆస్ట్రేలియాపై చరిత్రాత్మక టెస్టు విజయం సాధించిన భారత మహిళల జట్టు ఇక పరిమిత ఓవర్ల సిరీస్‌పై దృష్టి పెట్టింది. కంగారూలపై తొలిసారి సుదీర్ఘ ఫార్మాట్‌లో ఓ మ్యాచ్ నెగ్గిన టీమ్ఇండియా.. వన్డే, టీ20ల్లోనూ సత్తాచాటాలనే ఉద్దేశంతో యువ ఆటగాళ్లకు విరివిగా అవకాశాలు ఇచ్చింది. గురువారం నుంచి ప్రారంభం కానున్న మూడు మ్యాచ్‌ల వన్డే సిరీస్ కోసం బీసీసీఐ సోమవారం జట్టును ప్రకటించింది. శ్రేయాంక పాటిల్, మన్నత్ కశ్యప్, సైఖా ఇషాఖ్, టిటాస్ సధు తొలిసారి భారత వన్డే జట్టులో చోటు దక్కించుకున్నారు. వన్డే సిరీస్ అనంతరం ఇరు జట్ల మధ్య మూడు మ్యాచ్‌ల టీ20 సిరీస్ కూడా జరగనుంది. రెండు ఫార్మాట్లలోనూ హర్మన్‌ప్రీత్ కౌర్ జట్టుకు సారథ్యం వహించనుండగా.. స్టార్ ఓపెనర్ స్మృతి మందన వైస్ కెప్టెన్‌గా వ్యవహరించనుంది.

వన్డే జట్టు: హర్మన్‌ప్రీత్ (కెప్టెన్), స్మృతి, జెమీమా, షఫాలీ, దీప్తి, యస్తిక, రిచ, అమన్‌జ్యోత్, శ్రేయాంక, మన్నత్, సైకా, రేణుక, టిటాస్ సధు, పూజ, స్నేహ్ రాణా, హర్లీన్.

సెమీస్‌లో జాస్మిన్, మనీశ

- మహిళల జాతీయ బాక్సింగ్ టోర్నీ

గ్రేటర్ నోయిడా: మహిళల జాతీయ బాక్సింగ్ టోర్నీలో మనీశా మౌన్, జాస్మిన్ లంబోరియా సెమీఫైనల్లోకి దూసుకెళ్లారు. మహిళల 60కిలోల క్వార్టర్స్‌లో జాస్మిన్.. పూనమ్ కైత్వాస్(మహారాష్ట్ర)పై అలవోక విజయం సాధించింది. ఆది నుంచే తనదైన జోరు కనబరిచిన జాస్మిన్ పవర్‌ఫుల్ పంచ్‌లతో చెలరేగింది. సెమీస్‌లో పీఎస్ గిరిజాతో పూనమ్ తలపడనుంది. మరో క్వార్టర్స్‌లో మనీశ 5-0తో టీసీ లాల్‌రెముర్తిని చిత్తుచేసింది. తన అనుభవాన్నంతా ఉపయోగిస్తూ మనీశ..చెలరేగడంతో ప్రత్యర్థి నుంచి సమాధానం లేకపోయింది. 66కిలోల విభాగంలో అరుంధతి చౌదరీ 5-0తో కోమల్‌ప్రీత్ కౌర్‌పై విజయం సాధించి ముందంజ వేసింది.

సోమవారం క్రిస్మస్ పర్వదినం సందర్భంగా భారత మాజీ కెప్టెన్ మహేంద్రసింగ్ ధోనీ కుటుంబ సభ్యులతో వేడుకల్లో పాలుపంచుకున్న యువ క్రికెటర్ రిషబ్ పంత్

వాణిజ్య

పేటీఎంలో వెయ్యి మందిపై వేటు

- ఏఐ, వ్యయ నియంత్రణ ఎఫెక్ట్

Paytm

న్యూఢిల్లీ, డిసెంబర్ 25: ఫిన్‌టెక్ దిగ్గజం పేటీఎం ఏకంగా వెయ్యి మందికిపైగా ఉద్యోగులను విధుల నుంచి తొలగించింది. కృత్రిమ మేధస్సు (ఏఐ) టెక్నాలజీని ప్రవేశపెట్టడం, వ్యయ నియంత్రణ దిశగా వెళ్తుండటంతో సేల్స్, ఇంజినీరింగ్ తదితర విభాగాల నుంచి పెద్ద ఎత్తున సిబ్బందిని సంస్థ తీసేసింది. 'మరింత ప్రభావవంతమైన కార్యకలాపాల కోసం మేము ఏఐ ఆధారిత ఆటోమేషన్‌కు బదిలీ అవుతున్నాం. దీనివల్ల ఆపరేషన్స్, మార్కెటింగ్‌ల్లో మా సిబ్బంది సంఖ్య కొద్దిమేర తగ్గుతున్నది. మేము ఆశించిన దానికంటే ఏఐతో పని సంతృప్తికరంగా ఉంటున్నది. 10-15 శాతం ఉద్యోగ ఖర్చుల్ని ఆదా చేయగలమనే భావిస్తున్నాం. పనితీరు బాగాలేని వారందర్నీ క్రమేణా తొలగిస్తాం' అని పేటీఎం అధికార ప్రతినిధి స్పష్టం చేశారు. కాగా, 2021లోనూ పేటీఎం 500 నుంచి 700 మంది పనితీరు బాగాలేని ఉద్యోగులను బయటకు పంపాలని నిర్ణయించిన విషయం తెలిసిందే. ఈ ఏడాది జూలై-సెప్టెంబర్ త్రైమాసికానికి గాను రూ.292 కోట్ల నష్టాలను సంస్థ ప్రకటించిన విషయం తెలిసిందే.

రూ.4.30 లక్షల కోట్లు



పదేండ్లలో ప్రభుత్వ రంగ సంస్థల్లో వాటాల అమ్మకం ద్వారా సమీకరించిన కేంద్రం

న్యూఢిల్లీ, డిసెంబర్ 25: కేంద్రంలో నరేంద్ర మోదీ సర్కారు కొలువుదీరిన దగ్గర్నుంచి ఇప్పటిదాకా దేశంలోని ప్రభుత్వ రంగ సంస్థ (పీఎస్‌యూ)ల్లో పెట్టుబడుల ఉపసంహరణల విలువ రూ.4,30,336 కోట్లుగా ఉన్నది. నిజానికి ఈ పదేండ్లలో సర్కారీ కంపెనీల్లో వాటాల అమ్మకం ద్వారా కేంద్రం సమీకరించాలనుకున్నది రూ.9,42,925 కోట్లు. అయితే ఉద్యోగ-కార్మిక సంఘాల నుంచి వ్యతిరేకత, ఆశించిన స్థాయిలో కొనుగోలుదారుల నుంచి స్పందన లేకపోవడం, స్టాక్ మార్కెట్ ఒడిదుడుకులు ఇతరత్రా పరిస్థితులు అనుకూలించకపోవడంతో దాదాపు సగానికే పరిమితం కావాల్సి వచ్చింది.

టాటాల చేతికి..

ప్రభుత్వ రంగ సంస్థల ప్రైవేటీకరణే ధ్యేయంగా అడుగులేసిన మోదీ సర్కారు.. ఎయిర్ ఇండియా, ఎన్ఐఎన్ఎల్ తదితర కంపెనీలను అమ్మేసి తమ పంతం నెరవేర్చుకున్నది. అయితే ప్రభుత్వ అధీనంలో నష్టాల ఊబిలో కూరుకుపోయిన ఎయిర్ ఇండియా, నీలాచల్ ఇస్పాత్ నిగమ్ లిమిటెడ్ (ఎన్ఐఎన్ఎల్)లను టాటా గ్రూప్ చేజిక్కించుకోగా, ఇప్పుడవి నిలకడగా రాణిస్తూ లాభాల బాట పడుతుండటం గమనార్హం. నిరుడు జూలైలో రూ.12,100 కోట్లకు ఎన్ఐఎన్ఎల్‌ను టాటా స్టీల్ లాంగ్ ప్రోడక్ట్స్ కొన్నది. అయితే ఈ ఏప్రిల్-సెప్టెంబర్‌లో ఆ సంస్థ రూ.3,000 కోట్ల రెవిన్యూను సాధించడం విశేషం. ప్రభుత్వం పట్టించుకోక పాములు, తేళ్లకు ఆవాసమై.. చెట్ల మధ్య తుప్పు పట్టిపోయిన యంత్రాలతో కళావిహీనంగా మారిన ఎన్ఐఎన్ఎల్ ప్లాంట్‌ను కేవలం 90 రోజుల్లోనే టాటాలు పునరుద్ధరించడం కొసమెరుపు.

ఆర్ఐఎన్ఎల్, ఐడీబీఐ..

రాష్ట్రీయ ఇస్పాత్ నిగమ్ లిమిటెడ్ (ఆర్ఐఎన్ఎల్ లేదా వైజాగ్ స్టీల్), ఐడీబీఐ అమ్మకాలు కేంద్ర ప్రభుత్వానికి సాధ్యపడట్లేదు. ఆశించిన స్థాయిలో ఆదరణ లేకున్నా ఎయిర్ ఇండియాను ఎలాగోలా అమ్మేసిన మోదీ సర్కారుకు.. వైజాగ్ స్టీల్ విక్రయం విషయంలో కార్మికుల నుంచి భారీగా నిరసన సెగ తాకుతున్నది. ఎన్నికలు దగ్గర పడుతుండటంతో ప్రస్తుత ఆర్థిక సంవత్సరం ఇక ఆ సంస్థ జోలికి మోదీ సర్కారు వెళ్లదనే అనుకోవచ్చు. అలాగే ఐడీబీఐ బ్యాంక్ సేల్ విషయంలోనూ చివరకు ప్రభుత్వ రంగ సంస్థ ఎల్ఐసీ సాయం తీసుకోవాల్సి వచ్చింది. ఈ బ్యాంక్ ప్రైవేటీకరణకు ప్రభుత్వ నిబంధనలు, రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్బీఐ) అనుమతులు అడ్డంకిగా ఉంటున్నాయి. దీంతో ఇప్పుడప్పుడే ఐడీబీఐ బ్యాంక్ ప్రైవేటీకరణ కూడా లేనట్టేనన్న సంకేతాలు కనిపిస్తున్నాయి.

- ముందుకు కదలని బీపీసీఎల్, ఎస్‌సీఐ, కాంకర్ వంటి భారీ పెట్టుబడుల ఉపసంహరణలు
- ఈ ఆర్థిక సంవత్సరంలోనే ఎస్‌సీఐ, ఎన్ఎండీసీ స్టీల్ లిమిటెడ్, బీఈఎంఎల్, హెచ్ఎల్ఎల్ లైఫ్‌కేర్, ఐడీబీఐ బ్యాంక్‌ల వ్యూహాత్మక వాటా విక్రయ లక్ష్యాలు
- ప్రస్తుత ఆర్థిక సంవత్సరం పెట్టుబడుల ఉపసంహరణ లక్ష్యం రూ.51,000 కోట్లు. ఇప్పటిదాకా వచ్చింది రూ.10,049 కోట్లు. ఐపీవో, ఓఎఫ్ఎస్‌ల ద్వారానే సమకూరిన నిధులు
- గడిచిన పదేండ్లలో సమీకరించిన రూ.4.30 లక్షల కోట్లలో మైనారిటీ స్టేక్ సేల్స్‌తో రూ.3.15 లక్షల కోట్లు రాక
- ఆర్థిక వ్యవహారాలపై క్యాబినెట్ కమిటీ (సీసీఈఏ) ఆమోదం ఉన్నా.. ప్రభుత్వ ఆస్తుల నిర్వహణ, పెట్టుబడుల శాఖ (దీపం) నుంచి గ్రీన్‌సిగ్నల్ రాక నెమ్మదిస్తున్న నిధుల సమీకరణ
- వచ్చే ఏడాది జరిగే లోక్‌సభ ఎన్నికలు ముగిసిన తర్వాతే మళ్లీ ప్రభుత్వ రంగ సంస్థల ప్రైవేటీకరణ తిరిగి ఊపందుకోవచ్చన్న అంచనాలు

మోదీ హయాంలో పీఎస్‌యూల్లో పెట్టుబడుల ఉపసంహరణలు

(రూ.కోట్లలో)

ఆర్థిక సంవత్సరం	లక్ష్యం	సమీకరణ
2014-15	58,425	25,000
2015-16	69,500	32,210
2016-17	56,500	46,247
2017-18	72,500	1,00,642
2018-19	80,000	85,063
2019-20	1,05,000	50,298
2020-21	2,10,000	32,000
2021-22	1,75,000	13,534
2022-23	65,000	35,293
2023-24	51,000	10,049

- హెచ్‌పీసీఎల్, ఆర్ఈసీ, డీసీఐఎల్, హెచ్ఎస్‌సీసీ, ఎన్‌పీసీసీ, నిప్కో, టీహెచ్‌డీసీ, కామరాజర్ పోర్ట్, ఎయిర్ ఇండియా, ఎన్ఐఎన్ఎల్ సంస్థల్లో వ్యూహాత్మక లావాదేవీలు

రూపాయికి ససేమిరా

భారత కరెన్సీ రూపంలో చెల్లింపులను వద్దంటున్న చమురు ఎగుమతిదారులు

న్యూఢిల్లీ, డిసెంబర్ 25: విలువైన విదేశీ మారక ద్రవ్యాన్ని ఆదా చేసుకునేదిశగా ఎగుమతులకు రూపాయిల్లో చెల్లింపులు జరిపేందుకు కేంద్ర ప్రభుత్వం చేస్తున్న ప్రయత్నాలు పెద్దగా ఫలించడం లేదు. ముడి చమురు దిగుమతులకు భారత కరెన్సీని తీసుకునే సరఫరాదారులు దొరకడం లేదంటూ కేంద్ర చమురు మంత్రిత్వ శాఖ పార్టమెంటరీ స్టాండింగ్ కమిటీకి తెలిపింది. అంతర్జాతీయ వాణిజ్య ప్రక్రియ ప్రకారం క్రూడాయిల్ దిగుమతి కాంట్రాక్టులు అన్నింటికీ యూఎస్ డాలర్ల రూపంలోనే చెల్లింపులు జరుగుతుంటాయి. అయితే భారత కరెన్సీని అంతర్జాతీయకరణ చేసేక్రమంలో దిగుమతిదార్లు రూపాయిల్ని చెల్లించేందుకు, ఎగుమతిదార్లు రూపాయిల్ని తీసుకునేందుకు రిజర్వ్ బ్యాంక్ 2022 జూలై 11 నుంచి అనుమతులు మంజూరుచేసింది. క్రాస్‌బోర్డర్ చెల్లింపుల్లో రూపాయి పాత్రని పెంచేందుకు 18 దేశాలతో రూపాయిల్లో వాణిజ్యాన్ని సెటిల్ చేసేందుకు డజనకుపైగా బ్యాంక్‌లను ఆర్బీఐ అనుమతించింది. కొన్ని దేశాలతో జరిగే చమురుయేతర వాణిజ్యంలో రూపాయి మారకం కొంత విజయవంతమైనప్పటికీ, చమురు ఎగుమతిదారులు మాత్రం భారత కరెన్సీలో చెల్లింపుల్ని అంగీకరించడం లేదు. రూపాయిల్ని డాలర్లలోకి మార్చిడి చేసుకోవడానికి లావాదేవీ వ్యయాలు అధికంగా ఉండటం, మారకపు రేటు తీవ్రహెచ్చుతగ్గులకు లోనుకావడం తదితర ఆందోళనలను క్రూడాయిల్ సరఫరాదారులు వ్యక్తం చేస్తున్నారని స్టాండింగ్ కమిటీకి చమురు మంత్రిత్వ శాఖ వివరించింది. 2022-23 ఆర్థిక సంవత్సరంలో ప్రభుత్వ రంగ పెట్రో కంపెనీలు రూపాయి చెల్లింపుల ద్వారా క్రూడాయిల్‌ను ఏ మాత్రం దిగుమతి చేసుకోలేదని మంత్రిత్వ శాఖ తెలిపింది. అలాగే రూపాయి చెల్లింపులతో భారమయ్యే అధిక లావాదేవీ వ్యయాల్ని సరఫరాదారులు తమకు మళ్లిస్తున్నారని ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ (ఐఓసీ) వెల్లడించిందని మంత్రిత్వ శాఖ అధికారులు తెలిపారు.

యూఏఈకి తొలి రూపీ చెల్లింపులు

యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ (యూఏఈ) నుంచి కొనుగోలు చేసిన క్రూడాయిల్‌కు భారత్ తొలిసారిగా ఈ ఏడాది ఆగస్టు నెలలో రూపాయిల్లో చెల్లింపులు జరిపినట్టు కేంద్ర ప్రభుత్వ అధికారులు తెలిపారు. ఇతర సరఫరాదారులతో కూడా ఇటువంటి డీల్స్ కుదుర్చుకునేందుకు చూస్తున్నామని , కానీ ఎటువంటి లక్ష్యాలు పెట్టుకోలేదని చెప్పారు. రూపీ లావాదేవీల కోసం ఈ జూలైలో భారత్ యూఏఈతో ఒక ఒప్పందంపై సంతకాలు చేసింది. ఈ మేరకు అబుధాబి నేషనల్ ఆయిల్ కంపెనీ నుంచి 10 లక్షల బ్యారళ్ల క్రూడాయిల్ కొన్నందుకు ఐవోసీ రూపీ చెల్లింపులు జరిపింది. అలాగే రష్యా నుంచి జరిగిన కొన్ని చమురు దిగుమతులకు కూడా భారత్ కరెన్సీలోనే సెటిల్‌మెంట్ జరిగింది.

రిలయన్స్-డిస్నీ డీల్

ఫిబ్రవరికల్లా ఎంటర్‌టైన్‌మెంట్ వ్యాపారాల విలీనం

న్యూఢిల్లీ, డిసెంబర్ 25: ఎంటర్‌టైన్‌మెంట్ వ్యాపారాల్ని విలీనం చేసేందుకు రిలయన్స్ ఇండస్ట్రీస్, వాల్ట్ డిస్నీల మధ్య డీల్ కుదిరింది. దీంతో 2024 ఫిబ్రవరికల్లా భారత్‌లో మెగా ఎంటర్‌టైన్‌మెంట్, మీడియా విలీనాన్ని పూర్తిచేసేందుకు మార్గం సుగమమైంది. కొద్ది నెలలుగా రిలయన్స్, డిస్నీలు ఇందుకు సంబంధించిన చర్చలు జరుపుతున్నాయి. డీల్‌లో భాగంగా రిలయన్స్ ఎంటర్‌టైన్‌మెంట్ సబ్సిడరీ వయోకామ్ 18.. డిస్నీ స్టార్ ఇండియా ప్రధాన వాటాను విలీనం చేసుకుంటుంది. విలీన సంస్థలో రిలయన్స్‌కు 51 శాతం, డిస్నీకి 49 శాతం వాటా చొప్పున ఉంటుంది.

చిన్న షేర్లు..పెద్ద లాభాలు

2023 బిజినెస్ రివ్యూ

న్యూఢిల్లీ, డిసెంబర్ 25: ఈ ఏడాది జరిగిన భారీ మార్కెట్ ర్యాలీలో ఇన్వెస్టర్లకు చిన్న షేర్లే గొప్ప రాబడుల్ని పంచాయి. ఈ ఏడాది ప్రారంభం నుంచి డిసెంబర్ 22 వరకూ బీఎస్ఈ స్మాల్‌క్యాప్ ఇండెక్స్ 45.2 శాతం ర్యాలీ జరపగా, మిడ్‌క్యాప్ ఇండెక్స్ 41.74 శాతం జంప్‌చేసింది. ఇదే సమయంలో బీఎస్ఈ ప్రధాన సూచి సెన్సెక్స్ 16.87 శాతం పెరిగింది. సెన్సెక్స్‌తో పాటే స్మాల్, మిడ్‌క్యాప్ ఇండెక్స్‌లు సైతం చరిత్రాత్మక రికార్డుస్థాయిల్ని చేరాయి. ర్యాలీలో అధికంగా రిటైల్ ఇన్వెస్టర్లు పాలుపంచుకోవడంతోపాటు దేశ స్థూల ఆర్థిక ఫండమెంటల్స్ పట్ల ఆశాభావం నెలకొనడంతో స్మాల్, మిడ్‌క్యాప్ షేర్లు జోరుగా పెరిగాయని విశ్లేషకులు చెప్పారు. మిడ్‌క్యాప్, స్మాల్‌క్యాప్ ఫండ్స్‌లోకి భారీగా సిప్ పెట్టుబడులు రావడం కూడా ర్యాలీకి కారణమన్నారు. మొత్తంగా ఆర్థిక వ్యవస్థ అవుట్‌లుక్ బాగుంటే స్మాల్, మిడ్‌క్యాప్ విభాగాలు ర్యాలీ స్పీడ్‌గా ఉంటుందని ఏయూఎం క్యాపిటల్ నేషనల్ హెడ్ ముకేశ్ కొచ్చర్ వివరించారు.

పీఎస్‌యూల బుల్‌రన్

ఒక్కో బుల్ ర్యాలీకి నేతృత్వం వహించే రంగాలు మారుతుంటాయని, ఈ దఫా పీఎస్‌యూలు, రక్షణ, రైల్వేలకు చెందిన షేర్లు గొప్ప రాబడులు ఇచ్చాయని ముకేశ్ కొచ్చర్ తెలిపారు. జీడీపీ వృద్ధి బాగుంటుందన్న అంచనాలు, వచ్చే లోక్‌సభ ఎన్నికల తర్వాత కేంద్రంలో స్థిరమైన ప్రభుత్వం ఏర్పడుతుందని, ఆర్థిక సంస్కరణలు కొనసాగుతాయన్న ఆశాభావంతో ఇన్వెస్టర్లు రిస్క్ తీసుకునేందుకు సిద్ధపడినందునే చిన్న షేర్ల ర్యాలీ జరుగుతున్నదని మాస్టర్ క్యాపిటల్ సర్వీసెస్ డైరెక్టర్ పాల్కా ఆరోరా చోప్రా చెప్పారు.

Printed and Published by **Damodar Rao Divakonda**, on behalf of Telangana Publications Pvt Ltd, Printed at Telangana Publications Pvt. Ltd, S.No. 437, Near Velama Kalyana Mandapam, Devera Yanjaal, Shamirpet Mandal, Dist: Medchal - 500 078.
Published At Telangana Publications Pvt Ltd. 8-2-603/1/7,8,9. Krishnapuram, Road No.10, Banjara Hills, Hyderabad, 500 034, Telangana State. Editor: **Thigulla Krishna Murthy.** Ph: +91 40 2329 1999, Fax: +91 40 2333 4242, 040-23291118, Toll Free: 1800 425 3666. RNI No. TELTEL/2011/37693.